

తలుపు చప్పుడైతే వెళ్ళి తీసాను.
తెల్లవారుఝామున ఐదో, ఐదున్నరో అయ్యింది. నేననుకున్నట్టు తలుపు కొట్టింది మా ఇంటిది కాదు.... ఎదుటి ఫ్లాట్ వాళ్ళది.

మళ్ళీ తలుపేసి లోపలికి పోతుంటే అతను నా వంక ఇబ్బందికరంగా చూశాడు. ఓ క్షణం అతన్ని గమనించాను. పెరిగిన గడ్డం, చిరిగిన దుస్తులు, దగ్గేమో తెరలు తెరలుగా వస్తోంది... భుజాన సంచి... ఇప్పుడే రైలు దిగి వస్తున్నట్టనిపించింది. ఎందుకో అతన్ని చూడగానే అసంకల్పితంగా జాలి కలిగింది. నగర జీవనం మమకారంపై కప్పిన మేలి ముసుగు కారణంగా మరింకేం ఆలోచించకుండా తలుపు వేసి లోపలకి వచ్చి పడుకున్నాను. మళ్ళీ తలుపు చప్పుడు, ఆగి ఆగి దగ్గు వినిపిస్తూనే వుంది. ఇక నిద్ర పొగేట్టు లేదని వెళ్ళి తలుపు తీసాను. ఎదుటి ఫ్లాట్ తలుపు ఇంకా తెరుచుకోలేదు. ఈ జనారణ్యంలో ఏ గూటి పక్షులు ఆ గూటికే పరిమితం. ప్రక్కవాళ్ళ గురించి నాకు గానీ, నా గురించి వాళ్ళకి గాని తెలిసే అవకాశం వుండదు.

ఆ ముసలాయన మళ్ళీ నేనే తలుపు తీయడంతో ఆనీజీగా చూశాడు. నా అసహనాన్ని అలాగే మనసులో అదిమిపెట్టి "నిద్రలో వున్నట్టున్నారు. కాస్త తెల్లవారాక పలకరిద్దురు. అందాకా నా పోర్షన్‌లోకి రండి" అన్నాను.

అప్పటికే నీరసంలో మునిగి వున్నాడేమో నా అభ్యర్థనని వెంటనే అమలు చేశాడాయన. లోనికి రాగానే హాల్లో గోడవారగా చాప, పరుపు పరిచి పడుకోమని దుప్పటి ఇచ్చాను. నా నిద్ర కాస్తా ఈ అనుకోని అతిథి ఆగమనంతో ఎగిరిపోయింది. వంటింట్లోకి వెళ్ళి లైటు వేశాను కాఫీ కలుపుకోవటానికి. ఫలక్‌నామా వైపుగా లోకల్ ట్రైన్ ఒకటి చిన్నగా శబ్దం చేస్తూ వెళ్తోంది. ఎదుటి అపార్ట్‌మెంట్‌లో నాలుగైదు పోర్షన్‌లలో లైట్లు వెలుగుతున్నాయి. వేసవి కాలం వస్తున్నా చలి ఇంకా తగ్గలేదు.

సన్నగా చల్లగాలి కిటికీ లోంచి వస్తోంది. నేను కాఫీ కలిపి హాల్లోకి వచ్చేసరికి ఆ ముసలాయన నిద్రపోకుండా గోడకి జారగిలపడి పడుకున్నాడు.

"ఈ కాఫీ తాగి కాసేపు నిద్రపోండి. రాత్రంతా ప్రయాణం చేసి వచ్చినట్టున్నారు" అంటూ కాఫీ కప్ప అందించాను.

"అవును బాబు. వూరు నుండి వస్తున్నా" అన్నాడాయన.

ఇతరుల విషయాల్లో పెద్దగా జోక్యం చేసుకోవడం అలవాటులేని నేను అతన్ని అంతకుమించి ఏమీ అడగలేకపోయాను. ఆ రోజు క్లాసులో స్టూడెంట్స్‌కి చెప్పాల్సిన పాఠాన్ని చదువుతూ వుండిపోయాను. ఓ ఐదు నిమిషాలకి అతను నిద్రలోకి జారిపోయాడు.

ఆరున్నరకు చదువు ఆపి పనిలో పడ్డాను. స్నానం పూర్తి చేసి వంటా వార్పు చేసుకున్నాను. ఆ ముసలాయన మాత్రం గాఢ నిద్ర నుండి బైటకి రాలేదు. భోజనం పూర్తిచేసి, కారియర్ సర్దుకుని తొమ్మిది గంటలు అవుతుండగా అతన్ని నిద్ర లేపాను. వెంటనే ఉలిక్కిపడి లేచాడు. తనెక్కడ వున్నాడో అర్థం కావడానికి పది సెకండ్లు పట్టింది. ఒకసారి ఇహ లోకానికి వచ్చి నా వంక కృతజ్ఞతగా చూసి ఒళ్ళు విరుచుకుని లేచాడు. నిదానంగా మొదలైన దగ్గుతెర ఆయన్ని ఓ కుదుపు కుదిపి వదిలిపెట్టింది. తలుపు తెరుచుకుని ఎదుటి ఫ్లాట్ వైపు అడుగులేస్తూ "వస్తాను బాబూ!" అంటూ వెళ్ళిపోయాడు.

అతని తలుపు కొట్టే కార్యక్రమం మళ్ళీ మొదలైంది. ఇంటికి తాళం వేసి క్రిందకి వెళ్తూ ఎదుటి ఫ్లాట్ తలుపు తెరుస్తున్న చప్పుడు కావడంతో తల తిప్పి చూశాను. ఓ ఇరవై సంవత్సరాల అమ్మాయి తలుపు తీసింది. ముసలాయన లోనికి వెళ్ళాడు.

* * *

కాలేజీ కాగానే స్కూటర్ స్టార్ట్ చేసి, పారడైజ్‌లో ఓ చాయ్ తాగి టాంక్ బండ్ మీద తెలుగు వెలుగుల్ని పరామర్శిస్తూ ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి చేరాను. తాళం తీస్తుండగా వెనుక నుండి వినిపించింది.

"ఏమండీ! ఓ సారి మా రూం కొస్తారా?" అని. తల తిప్పి చూశాను. ఉదయం కనిపించిన ఆ ముగ్ధే. కాస్త ఆశ్చర్యపోయి తాళం తీసే పనిని వాయిదా వేసుకుని ఆమె రూంలోకి అడుగుపెట్టాను.

ఆమె గదిని చూస్తే ఆనందం వేసింది. ఎక్కడ వుండాల్సిన వస్తువులు అక్కడ వుండి, తీర్చి దిద్దిన బొమ్మల కొలువులా వుందా గది. సింగిల్ కాట్ బెడ్, టేబుల్ ఫాన్, టేబుల్ లాంప్, పుస్తకాల ర్యాక్, వాటిలో సైజు వారీగా అమర్చిన పుస్తకాలు...

గదిని చూడగానే ఆమె పట్ల ఓ ఆదరణీయ భావం అనంకల్పితంగా కలిగింది. నేనూ వంటరి వాడ్నే. నావీ ఇలానే రెండు గదులు అనీ వున్నాయి. ఎందుకు చెప్పకుంటే సిగ్గుచేటు అనిపించింది.

'కూర్చోండి' అని ఫైబర్ చెయిర్ నా వైపు నెట్టి ఆమె వంటగదిలోకి వెళ్ళింది. చుట్టూ చూశాను. ఉదయం వచ్చిన ముసలాయన జాడ కనిపించలేదు. ఆమె గదిలోకి టీ కప్పుతో రాగానే ఆ ప్రశ్న వేశాను.

"ఆయనేరీ?" అని.

"వెళ్ళిపోయారు" టీ అందిస్తూ అందామె.

మాటల్ని కొనసాగిస్తూ "– ఆ విషయం చెప్పడానికే మిమ్మల్ని పిలిచాను. ఉదయం తొమ్మిది దాకా మీ రూంలోనే వుంచుకున్నట్టున్నారు. థాంక్స్. మరోలా అనుకోకండి. మనుషుల్ని ఆదరించేప్పుడు అవతలి వాళ్ళకి ఆ స్థాయి వుందా లేదా అన్నది చూడాలి. కుక్కని సింహాసనం మీద కూర్చో పెట్టకూడదు కదా!"

నేను ఆమె మాటలకు ఒక్కసారి స్థాణువయ్యాను.

పాలమారడంతో దాన్ని దస్సులోకి మార్చి నిదానంగా ఆమె వంక చూశాను. ఎదురు గోడకు నిటారుగా ఆనుకుని రెండు చేతులు కట్టుకుని స్పష్టంగా మాట్లాడింది.

"... అర్హత లేని వాళ్ళకి గౌరవం ఆపాదించకండి. ఆయన గురించి తెలియక మీరు షెల్టర్ ఇచ్చి వుంటారు. నేను అర్థం చేసుకోగలను. కానీ మీ మంచితనాన్ని ఆసరాగా తీసుకుని ఆయన మళ్ళీ వస్తే నిర్మొహమాటంగా వెనక్కి పంపండి" అందామె.

నేను చేసిన పొరపాటును అర్థం చేసుకుని అడిగాను "క్షమించండి. ఇంతకీ ఎవరాయన?"

తలవంచుకుని చెప్పిందామె "మా నాన్న".

* * *

నేను మారాను. అవును. నేనునిదానంగా నా దినచర్యలను మార్చుకున్నాను. ఇప్పుడు నాకు ఓ వ్యాపకం ఎదురుగా కనిపిస్తోంది. తండ్రిని అసహ్యంచుకునే కన్న కూతుర్ని చూడ్డం ఇదే మొదటిసారి. ఓ కొడుక్కి తండ్రి మీద పెద్దగా ప్రేమ వుండకపోవచ్చు గానీ, సహజంగానే కూతురికి తండ్రి అంటే ఆపేక్ష వుంటుందనే మాట నేనింతవరకూ నమ్ముతూ వచ్చాను. అందుకే నేను మారాను.

ఎదుటి ఫ్లాట్ అమ్మాయి దినచర్యని గమనించడం ప్రారంభించాను. కాలేజీ నుండి కాస్త ముందుగా వస్తున్నాను. ఆమె రూం నుండి బైటకి

# ఈవారం కథ

వచ్చే సమయంలో రూమ్‌కి చేరే సమయంలో కారిడార్‌లో నిలబడి పలకరించడం మొదలుపెట్టాను.

నా మీద ప్రత్యేకమైన అభిమానాన్ని గానీ, అసక్తిని గానీ చూపేది కాదు. నిర్లిప్తంగా వుండేది. హలో అంటే హలో అని.

ఓ నెల రోజులు గడిచాయి. ఇక లాభం లేదని రంగంలోకి దిగాను.

ఓ చల్లని సాయంత్రం ఆమె రూమ్‌కి రాగానే టెర్రస్ పైకి ఆహ్వానించాను. మా అపార్ట్‌మెంట్ పై నుండి చూస్తే దాదాపుగా సిటీ అంతా కనిపిస్తుంది. నా ఆహ్వానాన్ని మన్నించి ఆమె వచ్చింది. ఓ కార్పెట్ పరిచాను. జగ్గులో చల్లని మంచినీళ్ళు, కొన్ని స్నాక్స్, ఓ ఫ్లాస్క్‌లో చాయ్ తయారుగా వుంచాను. మా సంభాషణ సజావుగా సాగటానికి అనువుగా పూర్వ రంగాన్నంతా సిద్ధం చేసుకున్నాను.

ఇద్దరం కార్పెట్ మీద కూర్చున్నాం.

"కొంచెం మీ గురించి వివరంగా చెప్పండి. ఎవరు మీరు, ఏమిటి మీ కథ, మీ నాన్నగారికీ మీకు ఏమిటి వైరం?" ఎప్పట్నించో మనసులో వున్న సందేహాల్ని సంధించేశాను. కథ ఎక్కడో చోట మొదలు కావాలిగదా.

"నన్ను ఉత్తేజ్ అంటారు. అమ్మా నాన్న ననపర్తిలో పొలం పనులు చేసుకుంటారు. నేను ఇక్కడ దివ్యజ్యోతి జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాను" అన్నాను నా వివరాలు చెబుతూ.

"నా పేరు గాయత్రి. ఎ.జి. ఆఫీస్‌లో ఎకౌంట్స్ సెక్షన్‌లో పని చేస్తున్నాను. స్వగ్రామం అమలాపురం. హైదరాబాద్ వచ్చి ఆరేడు నెలలైంది. అంతే!" అంది చిరునవ్వు నవ్వుతూ.

నాక్కాస్త ధైర్యం చిక్కింది. ఇక వదిలి పెట్టదలుచుకోలేదు. మనసులోనిమాట చెప్పేశాను.

# జాతి కోల్పోయిన మనిషి

## – వడ్డి ఓంప్రకాష్ నారాయణ్

"గాయత్రీ! ఉచిత సలహా ఇస్తున్నానని అనుకోకపోతే ఓ చిన్న మాట. పాపం మీ నాన్నగార్ని ఎందుకు పంపేశావో నాకర్థం కాలేదు. ఈ వయస్సులో ఆయన్ని అలా గాలికి వదిలేయడం ఎందుకో నాకు న్యాయంగా అనిపించలేదు. మీ కుటుంబ వ్యవహారాల్లో నేను జోక్యం చేసుకుంటున్నానని నువ్వు అనుకోకపోతే నేనో సలహా చెప్పనా... నిన్న ఆయన ఇమ్లీబన్ స్టేషన్‌లో భిక్ష మెత్తుకుంటూ కనిపించారు" నా గొంతు సన్నగా వణికింది. కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి.

"ఉత్తేజ్‌గారూ! మీ అమ్మను మీ నాన్నగారు హింసించడం మీరు సహించగలరా? పెళ్ళయ్యాక ఆయన మరో స్త్రీతో శారీరక సంబంధం కలిగి వుండటాన్ని మీరు హర్షించగలరా? మగాడ్ననే అహంకారంతో తానేం చేసినా చెల్లుతుందనే గర్వంతో ఆయన మిమ్మల్ని, మీ అమ్మగార్ని పురుగులా చూడటాన్ని మీరు భరించగలరా? నా జీవితంలో చాలా చిన్న వయస్సులోనే నేనీ స్థితులన్నీ అనుభవించాను. మా నాన్నకు మరో భార్య వుంది. ఆయనకు ఆవిడే సర్వస్వం.

మా అమ్మనీ, నన్నూ సమాజానికో, బంధువులకో భయపడి వదిలివేయకుండా ఓ చిన్న ఇంట్లో వుంచాడే గానీ ఏనాడూ ఆయన మమ్మల్ని మనుషులుగా చూడలేదు.

నాకు ఊహ తెలిసిన దగ్గర్నుండీ ఆయన నాకు ఓ శాడిస్ట్‌గానే పరిచయం. నాన్న ఎప్పుడూ సిగరెట్ తాగుతుండేవాడు. సన్నగా గాలేస్తే పడిపోయేట్టుగా వుండేవాడు. లోతుకుపోయిన కళ్ళు, కళ్ళ కింద నల్ల చారలు. ఎందుకో ఆయన్ని చూడడానికే భయం వేసేది. మా ఇంటికి వచ్చినప్పుడల్లా అమ్మని నానా హింసలు పెట్టేవాడు.

అమ్మ మధ్యతరగతి కుటుంబం నుండి వచ్చింది. ఆమె చిన్నతనంలోనే వాళ్ళ అమ్మ, నాన్న చనిపోయారు. అమ్మ మామయ్య దగ్గరే పెరిగింది. ఆమెకు వయసొచ్చే సరికి ఆస్తి లెక్కలు చూసి పెళ్ళి చేసి పంపాడు మామయ్య. దురదృష్టం ఆమెను పెళ్ళి అయ్యాక వెంటాడింది. అమ్మ నాన్న పాలపడింది. ఆయన పెట్టే బాధల్ని పళ్ళ బిగువున భరిస్తూ నెట్టుకొచ్చేది.

స్కూల్లో పిల్లల్ని వాళ్ళ నాన్నలు స్కూటర్ మీదో, సైకిల్ మీదనో తీసుకొచ్చి దించి, తీసుకువెళ్లటాన్ని, మధ్యాహ్నం లంచ్ అవర్లో కారియర్స్ తెచ్చి ఆప్యాయంగా వాళ్ళ పిల్లలకి భోజనం తినిపించడాన్ని చూసినప్పుడు నేను కోల్పోయిందేమిటో నాకు అర్థమయింది.

ఏదో ఒక వంకతో ఆయన రెండు మూడు నెలలు మా ఇంటికి రావడం మానేసేవాడు. ప్రతి నెలా నేనే ఆయన దగ్గరకెళ్ళి డబ్బులు తెచ్చేదాన్ని. మేం బ్రతకాలి కదా! ఆయన్నే దేవురించే వాళ్ళం.

## వెన్నతో...!

ఒక పెద్ద మనిషి దారిలో వెళ్తూ, ఓ చిన్న పిల్లవాడు ఏడుస్తుండటం చూసి...

"ఏమయింది బాబూ" అనడిగాడు.

"వాడు నా శాండ్ విచ్‌ను కాల్వలో తోసేశాడు" అన్నాడు ఏడుస్తూ.

"ఇచ్చతో (కావాలనేనా, అని)నేనా?" అనడిగాడు పెద్దమనిషి.

"కాదు, వెన్నతో" అన్నాడు పిల్లవాడు ఏడుస్తూనే.

అమ్మ చదువుకున్నది కాదు. మేం స్వతంత్రంగా బ్రతకలేం.

నిజానికి అమ్మ పేరున వున్న పొలం తాలుకూ డబ్బు సంవత్సరానికి ముప్పై వేల దాకా వస్తుంది. సిటీ ఏమిటంటే నెలకి ఖర్చుల నిమిత్తం ఐదు వందలు ఇవ్వడానికి ఆయన నానా హింసలూ పెట్టేవాడు. పులి గుహలోకి వెళ్ళే లేడిలా వుండేది నా పరిస్థితి. భిక్ష వడేస్తున్నట్టు, మమ్మల్ని ఆవవసరంగా పోషిస్తున్నట్టు ఫీలవుతూ ఇచ్చేవాడు డబ్బు. ఏ కూతురైనా తండ్రిని చూసి ఇంతలా భయపడడం మీరు ఎక్కడన్నా చూశారా? ఇవన్నీ కాదు ఉత్తేజ్‌బాబూ, ఆయనంటే నాకు అసహ్యం నా పదహారవ ఏట మా అమ్మ చనిపోయినప్పుడు కలిగింది.

ఆవిడ చనిపోతూ ఏమందో తెలుసా? "గాయీ– మీ నాన్న ఉత్త వెర్రిబాగులవాడు. ఆమె ఏదో ఆశ చూపి ఆయన్ని వలలో వేసుకుంది. రేపెప్పుడైనా ఆయన నిన్ను వెతుక్కుంటూ వస్తారు. ఆయన్ని చివరి దశలో ద్వేషించకు. నన్నెలా ప్రేమగా చూసుకున్నావో అలానే ఆయన్ని చూసుకోవాలి. నీకు జన్మనిచ్చిన తండ్రి ఆయన అన్న విషయం మరువకు" అని చెప్పింది.

ఒక్కసారిగా నా తల తిరిగిపోయింది. ఏమిటీ మాటలు– తన వ్యక్తిత్వాన్నంతా భర్త పాదాల దగ్గర ధార పోయడమేనా త్యాగమంటే? తనంటే లక్ష్యంలేని, తనని చిత్రహింసలు పెట్టిన మనిషిని అమ్మ ఇంకా ఎందుకు ఆకాశానికి ఎత్తుతుంది. ఇటువంటి అమ్మని కదా ఆయన నానా బాధలు పెట్టింది. అమ్మ మాటలు ఆ క్షణంలో నాకు ఆవేశాన్ని కలుగచేశాయి. అప్పట్నుంచే నాన్న గురించి నెగెటివ్‌గా స్పందించడం ప్రారంభించాను.

అమ్మ అన్నట్టుగానే ఆయన తన రెండవ భార్య చనిపోగానే నన్ను వెతుక్కుంటూ వచ్చారు. నేను తప్ప ఆయనకి పిల్లలెవరూ లేరు. పేకాట, తాగుడు వ్యసనంలో ఆస్తినంతా హారతి కర్పూరం చేసేశారు. బంధు వర్గంలో ఆయనంటే ఎవరికీ సద్భావన లేదు. ఇక మిగిలింది నేనే.

అమ్మంటే నాకు ప్రాణం. ఏనాడూ ఆమె నాకు లోటు అనేది చేయలేదు. అమ్మ నాన్న అన్నీ తనే అయి పెంచింది. అటువంటి అమ్మ కోర్కెను తీర్చాలా, వద్దా అనే సందిగ్ధంలో పడ్డాను ఆ రోజు ఉదయం ఆయన నన్ను వెతుక్కుంటూ మా ఇంటికి వచ్చినప్పుడు.

బైటి మనిషి మీకే ఆయన్ని ఆ స్థితిలో చూస్తే అంత జాలి కలిగిందే– నాకు ఆయన స్వంత తండ్రి. నేనెంత బాధపడాలి. అయినా కాస్త నిబ్బరించుకున్నాను.

స్వర్గం, నరకం వున్నాయో లేదో నాకు తెలియదు. ఓ మనిషి చేసిన నేరానికి శిక్ష అతను ఇక్కడే, ఈ జన్మలోనే అనుభవించాలని నాకు అనిపించింది. అందుకే ఆయనకి ఆశ్రయమివ్వకుండా గెంటేశాను.

మానవతా దృక్పథంతో ఆలోచిస్తే నాది తప్పే కావచ్చు. కానీ మానసికంగా నేననుభవించిన చిత్రహింస తల్చుకుంటే నా మట్టుకు నాకు నా నిర్ణయం పట్ల తృప్తిగా వుంది. అందుకే అలా ప్రవర్తించాను.

అమ్మా, నేనూ ఇద్దరం ఈ సమాజంలో ఎవరి స్థాయిలో వాళ్ళం ఒంటరిగా ఇరవై సంవత్సరాలు పోరాడాం. అనేక అవాకులు, చవాకులకు ఎదురు నిలబడ్డాం. బంధువుల, చుట్టుపక్కల వాళ్ళ మాటి పోటి మాటల్ని భరిస్తూ మేము అనుభవించిన మానసిక క్షోభని, చనిపోయే ముందు రెండు మూడు సంవత్సరాలపాటు ఆయన అనుభవించబోయే దరిద్రంతో పోలిస్తే అది చాలా తక్కువ శిక్ష.

ఇప్పుడు చెప్పు... ఉత్తేజ్ బాబూ.. నేనుచేసింది తప్పా... ఒప్పా?"

కల్మషంలేని కళ్ళతో, నిర్మలమైన మనసుతో గాయత్రి సూటిగా నన్ను అడిగింది.

ఇరవై ఐదు సంవత్సరాల క్రితం స్వార్థంతో, స్వప్రయోజనాలకు ఆశపడి నైతిక విలువలని మరచి మరో పెళ్ళి చేసుకున్నప్పుడే గాయత్రి తండ్రి మనిషిగా మరణించాడు. ప్రస్తుతం గాయత్రి ద్వేషిస్తోంది తండ్రినో, మనిషినో కాదు– కేవలం జీవచ్ఛవాన్నే.

మానసికంగా దెబ్బతిని, ఒంటరిగా మిగిలిపోయిన గాయత్రికి ఆత్మస్థైర్యాన్ని కలిగించి, జీవితంలో వుండే రంగుల హరివిల్లుని చూపించాల్సిన అవసరం వుందనిపించింది నాకు.

గాయత్రి వంక అభినందనపూర్వకంగా చూస్తూ "గాయత్రీ! నీ చర్యను హర్షిస్తున్నాను" అన్నాను.

* * *

గాయత్రి తండ్రిని నేను ఏజ్డ్ హోమ్‌లో చేర్పించిన విషయం ఇక ముందు ఆమెకు చెప్పకపోవడమే మంచిదని నాకాక్షణం అనిపించింది. ◆